# గుణమే మనిషికి శృంగారం

మంచికాలము, పదవులు, మంచిబ్రతుకు
కోరుచుందురు మనుజులు; కోరబోరు
మంచిబుద్ధులు, జ్ఞానంబు, మంచినడత
ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపరతు?
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!

ప్రేమస్వరూపులారా! మానవజీవితం అరుదైనది. కాలము విలువైనది. హృదయం మృదువైనది. మనస్సు మధురమైనది. ఇట్టి మానవత్వాన్ని, మానవతా విలువలను మానవుడు గుర్తించుకోలేకపోవటం చాల దురదృష్టం. మానవుడనగా కేవలం శరీరధారి కాదు. మానవుడు విశ్వవిరాట్స్వరూపుడు. విశ్వమునందు ఏ శక్తులు గలవో ఆ సమస్త శక్తులూ మానవునియందు ఇమిడియున్నవి. కాని, మానవుడు తన శక్తితత్త్వాన్ని కించిత్తైనా గుర్తించుకోలేకపోతున్నాడు. అరుదైన జీవితము, మృదువైన హృదయము, మధురమైన మనస్సు – ఇన్ని ఉన్నప్పటికీ శాంతి, సుఖములను పొందలేకపోతున్నాడు. కారణమేమిటి? స్వార్థమనే పెనుభూతమునకు లొంగి, తన హృదయంలో సంకుచితమైన భావములను చేర్చుకోవటంచేతనే అశాంతిని అనుభవిస్తున్నాడు. ప్రాచీన మానవులు నిరంతరము శాంతి, సుఖముల ననుభవిస్తూ వచ్చారు. అశాంతి అంటే ఏమిటో, దుఃఖమంటే ఏమిటో వారికి తెలియదు. సత్య, ధర్మములను ఆశ్రయించటంచేతనే వారు సుఖశాంతులతో జీవించగలిగారు.

ఎట్టి మంటనో అట్టి పొగ, ఎట్టి పొగనో అట్టి మేఘము, ఎట్టి మేఘమో అట్టి వర్షము, ఎట్టి వర్షమో అట్టి పంట, ఎట్టి పంటనో అట్టి వంట, ఎట్టి వంటనో అట్టి మనస్సు. కనుక, మానవుని మనస్సు తాను భుజించే ఆహారంపై ఆధారపడియున్నది. కాని ఈనాటి మానవుని తిండి తీర్థాదులు సక్రమమైనవిగా ఉండటం లేదు. కొలనుకు తామర పుష్పమే శృంగారము. గ్రామమునకు ఇళ్ళే శృంగారము. సముద్రమునకు అలలే శృంగారము. ఆకాశమునకు చంద్రుడే శృంగారము. అట్లే, మానవునికి గుణమే శృంగారము. కాని, మానవుడు గుణమును కోల్పోయి

srisathyasaivachanamrutam

అనేక కష్టములకు, బాధలకు గురి అవుతున్నాడు. తనను భగవంతుడు దేని నిమిత్తమై సృష్టించాడో మానవుడు గుర్తించుకోలేక పోతున్నాడు. భగవత్సృష్టియందు అనేక రహస్యములు, ఆదర్శములు ఇమిడియున్నాయి. అట్టి ఆదర్శములను మానవుడు విస్మరిస్తున్నాడు. మానవత్వం ఎంత ఘనమైనదో తెలుసుకోలేకపోతున్నాడు.

## హృదయమే భగవంతుని నివాసం

ప్రపంచంలోని సమస్త శక్తులకంటే మానవునియొక్క శక్తి చాలా ఘనమైనది. బంగారానికి, వజ్రాలకు, భూమికి విలువ ఎవరిస్తున్నారు? మనిషే కదా! కాని, అత్యంత ఘనమైన తన మానవత్వంయొక్క విలువను మాత్రం మనిషి గుర్తించుకోలేకపోతున్నాడు. తనయందున్న మానవత్వాన్నే గుర్తించుకోలేనివాడు దైవత్వాన్ని ఏరీతిగా గుర్తించగలడు? మొట్టమొదట తనయందున్న మానవత్వాన్ని గుర్తించడానికి ప్రయత్నించాలి. తన మానవత్వాన్ని గుర్తించుకున్న తరువాతనే దైవత్వాన్ని సులభంగా పొందగలడు. భగవంతుడు ఏ కైలాసమందో, ఏ వైకుంఠమందో, ఏ గుడియందో లేడు. స్వర్గము, కైలాసము మొదలైనవి భగవంతుని బ్రాంచాఫీసులు! భగవంతుని నివాసము మానవ హృదయమే! కనుక, భగవంతుణ్ణి ఎక్కడెక్కడో వెతకనక్కర్లేదు.

దేవుడనగ వేరు దేశమందున లేడు
దేవుడుండు తనదు దేహమందె
పాపమనగ వేరు పరదేశమున లేదు
తాను చేయు పనుల తగిలియుండు!

తనయందే ఉన్న దివ్యత్వాన్ని గుర్తించుకోలేకపోవటం అజ్ఞానమే. ఈ అజ్ఞానమునకు మూలకారణం ఏమిటి? మానవుడు నిరంతరం ప్రవృత్తి మార్గంలోనే ప్రయాణం సల్పుతున్నాడుగాని, నివృత్తివైపు చూడటం లేదు. మానవుడు చూసేది, వినేది, తలచేది అన్నీ ప్రవృత్తికి సంబంధించినవే! ప్రవృత్తి మార్గంలో జీవితాన్ని గడపటంచేత అన్నీ ప్రవృత్తి భావములే అతనిలో ఆవిర్భవిస్తున్నాయి. నివృత్తి తత్త్వమును గుర్తించటానికి ప్రయత్నించటం లేదు.

sri sathyasai vachanamrutam

## సంసార స్వప్నానికి మూలం మోహనిద్ర

ప్రేమస్వరూపులారా! మానవుని యందున్న దైవంకంటే వేరు దైవం లేదనే సత్యాన్ని మీరు మొట్టమొదట గుర్తించాలి. మానవుడే దైవం. మానవునకు, దైవమునకు ఏమీ భేదమూ లేదు. కేవలం భావదోషంవల్లనే భేదం కనిపిస్తున్నది. కంటికి కనిపించే విశ్వాన్ని మానవుడు ప్రాకృత భావంతో చూస్తున్నాడేగాని, విశ్వేశ్వర స్వరూపంగా చూడటం లేదు. ప్రాకృత దృష్టిని పరమాత్మ దృష్టిగా మార్చుకోవాలి. ప్రాకృత దృష్టితో చూసినప్పుడు ఇది ఒక గులాబీ పుష్పం. దైవభావంతో చూసినప్పుడు ఇదే హృదయ పుష్పం. దైవత్వంతో కూడిన ఈ జగత్తును మీరు జగత్తుగానే చూస్తున్నారు గాని, దైవత్వంగా చూడటంలేదు. కనుకనే ఈ జగత్సంబంధమైన కష్టనష్టములను అనుభవిస్తున్నారు. మదాలస తనకు పుట్టిన ప్రతి బిడ్డకు సత్యాన్ని ఈ విధంగా బోధిస్తూ వచ్చింది – "నాయనా! నీవు కేవలం ఈ భౌతికమైన శరీరానివి కాదు. నీవు అజ్ఞానమునకు, మాయకు అతీతుడవు. కాని, మోహమనే నిద్రలో సంసారమనే స్వప్నమును గాంచి నీ స్వస్వరూపాన్ని మరచిపోతున్నావు. మోహమనే నిద్రనుండి మేలుకొని జ్ఞానమనే జాగ్రత్తలో ప్రవేశించు".

కలలు రావటానికి కారణం ఏమిటి? కొంతమంది ఆహార దోషంవల్ల కలలు వస్తాయని భావిస్తున్నారు. మరికొంతమంది తలంపులే కలలకు మూలకారణమని అనుకొంటున్నారు. కాని, కలలకు ఇవేవీ కారణం కావు. నిద్రయే లేక స్వప్నమే రాదు. కనుక, స్వప్నమునకు నిద్రయే మూల కారణం. అదేవిధంగా, సంసారమనే స్వప్నమునకు మోహమనే నిద్రయే కారణం. ఈవిధమైన బోధలు సల్పి, మదాలస తన కుమారులను గొప్ప యోగులుగా మార్చివేసింది. మానవుడు జన్మించింది జగత్తుకు సంబంధించిన విషయములను అనుభవించటానికి కాదు. ఎంత అనుభవించినా మానవునికి తృప్తి కల్గటం లేదు. అనుభవించే కొలది ఆశలు పెరిగిపోతున్నాయే గాని, తరిగిపోవటం లేదు.

మానవుడు మొట్టమొదట తన తత్త్వాన్ని తాను గుర్తించుకోవాలి. మానవుడనగా ఎవరు? మా – అనగా అజ్ఞానము; న – అనగా లేకుండా; వ– వర్తించటం. కనుక, అజ్ఞానము లేకుండా వర్తించేవాడే మానవుడు. ఈ పదానికి మరొక అర్థం కూడా ఉన్నది. మా – అనగా

sri sathyasai vahini

కాదు; నవ – అనగా క్రొత్త. కనుక, మానవుడు క్రొత్తవాడు కాదు, పాతవాడే. ఇతడు నవీన మానవుడుకాదు. సనాతన మానవుడు, పురాతన మానవుడు, ఎన్నో వేల సంవత్సరములనుండి వస్తున్నాడు.

**సుఖ, దుఃఖాలకు కర్మలే కారణం**

ఈనాడు ప్రవృత్తి రీతిగా, ప్రాకృతమైన రీతిగా, భౌతికమైన రీతిగా 2000 సంవత్సరం ప్రారంభమైనదని అనుకుంటున్నారు. ఇది సమష్టియొక్క కొలతకాదు, సమష్టియొక్క తత్త్వము కాదు. సమష్టి అనగా దైవమే! వ్యష్టి జీవుడు, సమష్టి దేవుడు. దైవ భావంతో చక్కగా విచారణ చేసినప్పుడు ఈ 2000 సంఖ్య చాల అల్పమైనదని గుర్తించవచ్చు. ఇప్పటికి ఎన్నో కోట్ల సంవత్సరములు జరిగిపోయినవి. కనుక, ఇది 2000 సంవత్సరం అని చెప్పుకోవటం అర్థం లేని విషయం. జీసస్ కాలంనుండి ఈనాటివరకు 2000 సంవత్సరాలు గడిచాయి. దీనికి పూర్వం సంవత్సరములకు గ్రీకు దేశ రాజుల పేర్లుండేవి. నెలలకు కూడా గ్రీకు దేశ రాజుల పేర్లే పెట్టబడినాయి. ఈవిధంగా నెలలకు, సంవత్సరములకు మానవుల పేర్లు పెట్టుకుంటున్నారు. గాని మానవత్వాన్ని మాత్రం తెలుసుకోలేకపోతున్నారు.

సెకండ్లు నిమిషములౌతున్నాయి; నిమిషములు గంటలౌతున్నాయి. గంటలు దినములౌతున్నాయి; దినములు నెలలౌతున్నాయి; నెలలు సంవత్సరము లౌతున్నాయి. కనుక, నూతన సంవత్సరముకోసం మీరు కాచుకోనక్కర్లేదు. ప్రతి సెకండు నూతనమైనదే. ఈ నూతన సంవత్సరంలో ఏవిధమైన శుభములు, అశుభములు సంభవిస్తాయో అని అనేకమంది విచారిస్తున్నారు. మీ సుఖ దుఃఖములకు సంవత్సరములు కారణం కాదు, మీరు చేసే కర్మలే మూల కారణం. ఏ విత్తనం నాటుతారో ఆ మొక్కనే మొలుస్తుంది.

ఇది చేతు, అది చేతు, ఇంకెన్నియో చేతు
ననుచు ఊహలు అల్లి అలసిపోకు
ఏ విత్తులను నాటి యిచ్చోట నుంటివో
ఆ ఫలమ్ములె నీకు అందుచుండు
విత్తన మొకటైన వేరైన ఫలములు
సంభవించుట ఎట్లు సాధ్యమగును?

sri sathyasai vachanamrutam

ప్రతిమానవుడు జన్మించేటప్పుడు ఒక కంఠమాలతో జన్మిస్తున్నాడు. అయితే, అది రత్నాలతోను, ముత్యాలతోను చేయబడినది కాదు.

జనని గర్భము నుండి జన్మించినప్పుడు
మంచి ముత్యపు సరుల్ మచ్చునకును లేవు
మేల్మి బంగరు దండ మెడకు లేదు
కంఠమాలలేవి కానరావు
రత్నాల హారముల్ రంజిల్లగా లేవు
పచ్చలు కెంపులు పొదగ లేదు
వజ్రాల హారముల్ వర్థిల్లగా లేవు
గోమేధికంబులు తోడ లేవు

కలదు, కలదొక్క మాల మీ కంఠమందు
ఎన్ని చేసిన అవియన్ని ఎంచి ఎంచి
మంచియైనను, చెడుగైన త్రుంచకుండ
బ్రహ్మ మీకిచ్చి పంపును బరువు మాల
కర్మలన్నియు చేర్చిన కంఠమాల!

కనుక మీరు చేసే కర్మలు సక్రమమైనవిగా, పవిత్రమైనవిగా ఉన్నప్పుడు మీకు అన్నీ పవిత్రమైన ఫలితాలే లభిస్తుంటాయి.

**మార్చి తరువాత మంచి రోజులు వస్తాయి**

ప్రాకృతమైన రీతిగా ఈనాడు 1999 వ సంవత్సరం అంత్యమై, 2000 సంవత్సరం ప్రారంభమైనది, రాబోయే జనవరి 1 వ తేదికి 2000 సంవత్సరం పూర్తి అయిందని చెప్పవచ్చు. కనుక, ఇది 2000 సం॥ ఫలితంగా భావించరాదు, 1999 సం॥ ఫలితంగానే విశ్వసించాలి. మొత్తంపైన ఈ వచ్చిన సంవత్సరం చాల ఉత్తమమైన స్థితిని అందిస్తుంది. ఇది దేశమునకు, వ్యక్తులకు చాల ఉత్తమమైన కాలంగానే ఉంటున్నది. ఈనాడు జనవరి నెల ప్రారంభమైనది. జనవరి, ఫిబ్రవరి, మార్చి వరకు కొంచెం ఒడిదుడుకులు ఉంటాయి. దేనివల్ల? ఈ 2000

srisathyasaivachanamrutam

సంవత్సరంలో సోలార్ పద్ధతులు కొంత మారిపోతున్నాయి. ఈ మార్పు సంభవించటానికి మూడు నెలల కాలం పడుతుంది. ఇందులో కొన్ని కష్టములు, సుఖములు, బాధలు కూడ సంభవిస్తుంటాయి. కాని, మార్చి తరువాత స్థిరమైన, శుద్ధమైన పవిత్రమైన కాలం ప్రాప్తిస్తుంది. అయితే అంతా కాలానికి వదిలేసి జీవించకూడదు. పురుష ప్రయత్నం అత్యవసరం.

**"బంగారు!"**

ఈనాడు మానవునియందుండవలసిన మానవతా గుణములు శూన్యమైపోతున్నాయి. ప్రేమ అనేది ఎక్కడా కనిపించటం లేదు. ధర్మమును ఎవరూ ఆచరించటం లేదు. ఇంక, శాంతి ఏరీతిగా లభిస్తుంది? బంగారము లేక నగలు తయారుకావటానికి వీలుకాదు. అదేవిధంగా భగవంతుడు లేక మీకు సత్యంగాని, ధర్మంగాని, శాంతిగాని ప్రాప్తించవు. ఇవన్నీ భగవంతుని ద్వారా లభించేవే! భగవంతుడు హిరణ్యగర్భుడు, బంగారం వంటివాడు. కనుక భగవంతుడనే బంగారాన్ని మీ హృదయంలో పెట్టుకుంటే, ఆ బంగారంచేత సత్యము, ధర్మము, శాంతి అనే నగలను చేయించుకోవచ్చును. అందరియందు హిరణ్యగర్భుడున్నాడు. దీనిని దృష్టియందుంచుకొనే నేను అందరినీ 'బంగారు! బంగారు!' అని పిలుస్తుంటాను. అందరియందు భగవంతుడున్నాడనే సత్యాన్ని గుర్తించాలి. మీయందు భగవంతుడున్నాడని విశ్వసించినప్పుడే మీకు సర్వసుఖములు చేకూరుతాయి. హృదయమందున్న దైవత్వాన్ని విస్మరించి, బాహ్యమైన ఫలితాలకోసం ప్రాకులాడితే ప్రయోజనం లేదు.

**పాండవుల ఆదర్శం**

ప్రాచీన కాలమునుండి భారతదేశము అన్ని దేశములకూ దైవత్వాన్ని గురించి ప్రచార ప్రబోధలు సల్పుతూ, సుస్థిరమైన శాంతి, భద్రతలు చేకూర్చుతూ వచ్చింది. ప్రాచీన భారతీయ సంస్కృతి చాల పవిత్రమైనది; ఇది దివ్యమైనది, భవ్యమైనది, నవ్యమైనది. కాని, ఇట్టి సంస్కృతియొక్క తత్త్వాన్ని ఎవ్వరూ విచారణ చేయటం లేదు. ఈనాటి విద్యార్థులుకూడా ఈ సంస్కృతిని అర్థం చేసుకోలేక పోతున్నారు. మహాభారత యుద్ధంయొక్క ఫలితాన్ని ఉదాహరణగా తీసుకోండి. పంచ పాండవులు నిరంతరం కృష్ణుణ్ణి స్మరిస్తూ వచ్చారు. వారు భగవంతునికి మొట్టమొదటి స్థానం అందించారు; ప్రపంచానికి రెండవ స్థానమిచ్చారు. స్వార్థాన్ని చివరికి నెట్టారు. First God, Next world, last I, అని వారు భావించారు. కాని, కౌరవులు

sri sathyasai vahanamrutam

అలా కాదు. వారి దృష్టిలో మొదట స్వార్థం, తరువాత ప్రపంచం, చివరికి భగవంతుడు. అనగా, వారు First I, Next world, Last God అని భావించారు. కనుకనే, వారు భగవంతుణ్ణి కోల్పోయారు, జీవితాన్నే నాశనం చేసుకున్నారు. కనుక, మానవుడు ఎల్లప్పుడు దైవాన్ని ముందు ఉంచుకోవాలి. దైవాన్ని ముందు ఉంచుకున్నవారికి ఏ ప్రమాదము సంభవించదు. దైవాన్ని స్మరించుకుంటూ దేశసేవలో జీవితాన్ని గడపాలి.

**దేహము, దేశము బింబ ప్రతిబింబములు**

ప్రేమస్వరూపులారా! దేహము వేరు, దేశమువేరు కాదు. దేశములో ఉన్న పంచభూతములే దేహములోను ఉన్నాయి. కనుక, దేహము, దేశము రెండు బింబప్రతిబింబములే! ఇవి అన్యోన్యాశ్రయములు, అవినాభావ సంబంధము కల్గినవి. ఈ సత్యాన్ని మీరు గుర్తించాలి. నేటి యువకులే భవిష్యత్తులో నాయకులు. భవిష్యత్తు బాగుపడాలంటే యువకులు దైవంపై సంపూర్ణ విశ్వాసంతో తమ నిత్యకర్మలను ఆచరిస్తూరావాలి. జాతీయ భావమును, దేశాభిమానమును అభివృద్ధి పర్చుకోవాలి.

ఇది నాదు మాతృదేశము
ఇది ప్రియ మాతృభాష ఇది నా మతమం
చెదగొట్టి నుడువ నేరని
బదికిన జీవి యొకండీ వసుధను గలడా!

ఏదేశమువారు ఆ దేశముపై అభిమానమును కల్గియుండాలి. కాని, నేటి యువకులు దేశాభిమానమును కోల్పోయి విదేశాలపై అభిమానం పెంచుకొని ఉభయభ్రష్టులైపోతున్నారు.

**దేహము – దేహి**

ప్రేమస్వరూపులారా! భగవంతుడు సర్వాధారుడు, సర్వశక్తిమయుడు, సర్వజ్ఞుడు, సర్వ భూతాంతరాత్మ, సర్వత్ర ఉన్నది భగవంతుడొక్కడే!

ఏది లేదనుచుంటిమో అద్ది కలదు
ఏది కలదనుచుంటిమో అద్ది లేదు.
ఉన్నదాతడె దైవంబు ఎన్నటికిని
లేనిదయ్యెను విశ్వంబు కానరయ్య!

sri sathyasai vachanamrutam

ప్రత్తి లేక వస్త్రము లేదు. వెండి లేక టంబ్లరు లేదు. అట్లే దైవం లేక మానవుడు లేదు, జగత్తే లేదు. మీరు ఆకారాన్ని ఆధారంగా తీసుకొంటున్నారు. కాని ఆకారం ఏనాటికైనా మార్పు చెందునదే! మార్పు చెందే దేహాన్ని సత్యంగా భావించకండి. దేహియైన దైవత్వాన్ని సత్యంగా భావించండి.

చావు పుట్టుక లేనట్టి శాశ్వతుండు
ఆది మధ్యాంత రహితు డనాదివాడు
తాను పుట్టక చావక చంపబడక
ఆత్మరూపుడై అంతట వెలసియుండు!

ఈ సత్యాన్ని గుర్తించండి. మానవ జన్మ అరుదైనదని గుర్తించండి. మీ హృదయం మృదువైనదిగా, మనస్సు మధురమైనదిగా ఉండాలి. కాని, మధురమైన మనస్సును మీరు విషయాలపై మళ్ళించి, దానిని విషమయం గావించుకుంటున్నారు; మృదువైన హృదయాన్ని కఠినంగా మార్చుకుంటున్నారు; విలువైన కాలమును వ్యర్థం చేసుకుంటున్నారు. కాలము భగవత్స్వరూపము. కనుకనే "కాలాయనమః, కాలకాలాయనమః ...." అని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నారు. కనుక, కాలమును వ్యర్థం చేయకండి. కాయము అనిత్యమైనది. అది కాలముతోనే పెరుగుతున్నది. కాలముతోనే తరుగుతున్నది.

**త్వరలోనే అన్ని దేశాలవారు సమైక్యమౌతారు**

ప్రేమస్వరూపులారా! ఈనాడు మీరు చాల పవిత్రమైన దినంగా భావిస్తున్నారు. "యద్భావం తద్భవతి", మీ భావములను పురస్కరించుకొనియే ఫలితం మారుతుంటుంది. ఈ 2000 సంవత్సరం ఏ మాత్రం చెడ్డది కాదు. ఇది చాల ఉన్నతమైన ఆదర్శాన్ని అందిస్తుంది; దివ్యమైన భగవత్తత్వాన్ని ప్రబోధిస్తుంది. ఐకమత్యాన్ని చేకూర్చుతుంది. అతి శీఘ్రకాలమందే అన్ని దేశములవారు ఏకమైపోతారు. ఈనాడు అమెరికా, రష్యా, జపాన్, చైనా, పాకిస్థాన్, ఇండియా వేరువేరుగా ఉంటున్నాయి. ఇవన్నీ త్వరలోనే ఐకమత్యాన్ని పొందుతాయి. ఎవరు మనకు ద్వేషులని భావిస్తున్నారో వారే పరమ మిత్రులుగా మారిపోతారు. కనుక, మనకు ఎవ్వరూ ద్వేషులు లేరు, ఎవ్వరూ మనకు విరోధులు కారు. అందరూ అన్నదమ్ములే, అక్క చెల్లెండ్రే!

మానవ సోదరత్వాన్ని, దైవపితృత్వాన్ని మీరు అతి శీఘ్రకాలంలోనే చూడగలరు. దానికోసం

sri sathyasai vachanamrutam

మీరందరూ పవిత్రమైన హృదయంతో ప్రార్థన చేయండి. ఈనాడు జగత్తులో అనేకమంది అనేక బాధలు పడుతున్నారు. ఇటీవల హైజాక్‌కు గురియైన విమానంలోని ప్రయాణికులు ఎంత ఆందోళన చెందారో మీకు తెలుసు. ఈ బాధలన్నింటికీ పరిహారం ప్రార్థనే! ప్రార్థనచేత జగత్తులో సాధించలేనిది ఏదీ లేదు. కఠినమైన హృదయాన్ని కూడ కరిగిస్తుంది ప్రార్థన. కనుక "లోకాస్సమస్తాః సుఖినో భవంతు" అని హృదయపూర్వకంగా ప్రార్థించండి. కేవలం మీరు, మీ కుటుంబము, మీ బంధుమిత్రులు మాత్రమే కాదు. అన్ని దేశములవారు క్షేమంగా ఉండాలని ప్రార్థించండి.

### ప్రేమ ఇస్తుంది, క్షమిస్తుంది

ప్రేమస్వరూపులారా! మీరు ముఖ్యంగా పెంచుకోవలసింది ప్రేమ ఒక్కటే. ప్రేమ ఒక్కటి ఉంటే ద్వేషానికి అవకాశమే ఉండదు. ఆనాడు గోపికలు కూడ చెప్పారు:

ప్రేమ రహిత మరుభూములలో
ప్రేమాంకురములు పెంపొంద
ప్రేమావేశముతో
ప్రేమసుధా వర్షము వర్షింపగ
ప్రేమనదులు ప్రవహింపగ
మురళీ గానము సేయగదే!
కృష్ణా! గానము సేయగదే!

ప్రేమరహితమైన హృదయ క్షేత్రాలలో మీరు ప్రేమ బీజమును నాటాలి, దానికి ప్రేమజలమును పోయాలి. ప్రేమ వర్షమును కురిపించాలి, ప్రేమ ప్రవాహమును ప్రవహింపజేయాలి. మీ ప్రేమను అందరికీ పంచాలి. ఈ నూతన సంవత్సరంలో మీరు చేయవలసిందేమిటంటే – నిర్మలమైన, నిశ్చలమైన నిస్స్వార్థమైన ప్రేమను పెంచుకోవాలి. మీరు మీ ప్రేమను లౌకికమైన విషయాలలో ప్రవేశపెట్టడంచేతనే అనేక చిక్కులకు గురి అవుతున్నారు. ప్రేమ ఇస్తుంది, క్షమిస్తుంది; స్వార్థం స్వీకరిస్తుంది, మరచిపోతుంది. కనుక స్వార్థపూరితమైన (Selfish Love) ప్రేమ మనకు వద్దు. Selfish Love

srisathyasaivachanamrutam

(స్వార్థపూరితమైన ప్రేమ) fish (చేప) యొక్క దుర్గంధమువలె భరించటానికి వీలుకానిది. కనుక నిస్వార్థప్రేమను పెంచుకోవాలి. అందరినీ ప్రేమించాలి. ఎవరేమనుకున్నా మీరు వెరువనక్కర్లేదు. మీ ప్రేమను పవిత్రంగా పెట్టుకోండి, చాలు. అప్పుడు జగత్తంతా పవిత్రమవుతుంది.

**విశ్వశాంతికి ప్రేమయే ఏకైక మార్గం**

ఈ 2000 సంవత్సరం ఏ ఫలితాన్ని అందిస్తుందో అని అనేకమంది అనేక విధాలుగా అపోహపడుతున్నారు. ఏ బాధలూ లేవు. వస్తుంటాయి. పోతుంటాయి. సుఖదుఃఖములు లేకుండా ప్రపంచం ఉండటానికి వీలులేదు. కాని, జగత్తుకు ఏదీ చెడ్డది కాదు. రెండు బాధల మధ్య గల విరామమే సుఖము. కనుక, బాధలు లేకుండా సుఖం లభించటానికి వీలుకాదు. అయితే అన్నీ కదలిపోయే మేఘాలవలె వస్తుంటాయి, పోతుంటాయి. వాటికి మీరు వెరువనక్కర్లేదు. ప్రేమతో ఎదుర్కోవాలి, ప్రేమగా మార్చుకోవాలి, మీరు ప్రేమస్వరూపులు కావాలి. అప్పుడే విశ్వశాంతి చేకూరుతుంది. మీరు "శాంతి శ్శాంతి శ్శాంతిః" అని మూడు పర్యాయములు ఎందుకోసం చెపుతున్నారు? శారీరక శాంతి, మానసిక శాంతి, ఆత్మశాంతి – ఈ మూడు కావాలి. కనుకనే మీరు ఒక్కరు కాదు, ముగ్గురు. మీ దృష్టిలో మీరు (దేహము), ఇతరుల దృష్టిలో మీరు (మనస్సు), అసలైన మీరు (ఆత్మ). ఈ మూడింటియందు మీకు శాంతి కావాలి. దీనికి ప్రేమ ఒక్కటే మార్గం.

ఒక్క ప్రేమతో మీరు సర్వమును సాధించవచ్చు. దీనికి నేనే నిదర్శనం. నాయందున్నది ప్రేమ ఒక్కటే. ఈనాడు ఇన్ని వేలమంది ఇక్కడ సమావేశమయ్యారు. మీ అందరికీ ఎవరు ఇన్విటేషన్ (ఆహ్వానం) పంపించారు? ఏమీ లేదు. నాకు మీపైనున్న ప్రేమ, మీకు నాపైనున్న ప్రేమ – ఈ రెండింటి ఏకత్వమే ఈ సమావేశమునకు మూలకారణం. కనుక ప్రేమచేత ఏమైనా సాధించవచ్చునే సత్యాన్ని గుర్తించి, వర్తించండి. ప్రేమను అభివృద్ధి పర్చుకోండి. ద్వేషము, అసూయ, ఆడంబరమువంటి దుర్గుణాలను త్రుంచివేయండి. అవి జంతు లక్షణాలే గాని, మానవతా గుణాలు కావు. మానవునికి సత్యమే ఆధారము, ధర్మమే జీవితము, ప్రేమయే ప్రధానము. ఈ మూడింటినీ అభివృద్ధి పర్చుకుంటే శాంతి మీ జన్మహక్కు అవుతుంది. కనుక మీరు స్వార్థమును దూరం నెట్టి, ఐకమత్యాన్ని ఆశించి, అందరి క్షేమంకోసం ప్రార్థన చేయండి.

sri sathyasai vahini amrutam

మీరు జన్మించినది కేవలం తిని, తిరిగి, నిద్రించడానికి కాదు. మానవజన్మ ఎత్తినందుకు దేశానికి ఒక ఆదర్శాన్ని అందించాలి. ఏమిటా ఆదర్శము? అందరికీ మీకు చేతనైన సహాయం చేయాలి. అందరినీ ప్రేమించాలి; అందరినీ సేవించాలి. అప్పుడే మీరు దైవాన్ని ప్రేమించినవారవుతారు. The best way to love God is to love all and serve all. ప్రేమ, సేవ – ఈరెండింటితో మీరు ఈ నూతన సంవత్సరం నుండి నూతనమైన జీవితాన్ని గడపాలని నేను ఆశిస్తున్నాను.

**(01.01.2000 ఉదయం సాయి కుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్య సందేశము)**

sri sathyasai vachanamrutam